# ఆశ + ఆశ

రాజారావు చిరుబురు లాడటం చూసి సుమతి ఆశ్చర్యపోయింది. అతనలా వుండటానికి కారణం ఏమిటా అని ఎంత ఆలోచించినా అర్థంకాలేదు. అతని పలకరించబోతే కస్సుమంటున్నాడు. సాధారణంగా రాజారావు కోపంగా వుంటే సుమతి అతన్ని మాటల్లో పెట్టి జోక్స్ వేస్తూ, కవ్విస్తూ అతని మూడ్ మార్చేస్తుంది. కాని యీ సారి అతనెంతకీ లొంగకపోయే సరికి ఆమెకి మనసు బాధపడింది.

రాజారావుకి మనసు కలతగా వుంది. బాధగావుంది. ప్రతీ చిన్న విషయాన్ని ఎంతో ప్లాన్‌తో, దూరదృష్టితో. ప్రతి ఖర్చూ బడ్జెట్ వేసి, లాభనష్టాల పట్టిక తయారుచేసి, ఎంతో మెలకువతో చేసే తనెందుకిలా నష్టపోతున్నాడా అని మరీ యిదయ్యాడు.

చిన్నప్పటినుంచి రాజారావు చాలా జాగ్రత్తపరుడు. చిన్న వయసులోనే డిగ్రీ తీసుకుని, కనిపించిన ప్రతి ఉద్యో

గానికి దరఖాస్తులు పెట్టి, కృషిచేసి ఉద్యోగం సంపాదించాడు. ఉద్యోగం వచ్చిన అయిదు సంవత్సరాలవరకు పెళ్ళిచేసుకోనని భీష్మించుకుర్చుని, ఎంతో డబ్బుకూడ బెట్టి, సంసారానికి కావలసినవన్నీ కొని, తన ఇరవై ఎనిమిదో ఏట సుమతిని పెళ్ళిచేసుకున్నాడు. పెళ్ళయి యింకా రెండేళ్ళుకాలేదు. ఈ రెండేళ్ళలోనూ యిద్దరూ కలసి ఏ రెండు మూడు సినిమాలు చూశారో -! అంతే ఇద్దరూ కలిసివెళ్తే ఖరీదెక్కువని విడి విడిగా వెళ్ళడాన్నే అతను సమర్ధిస్తాడు. ఎలా చూస్తేనే, సినిమా చూడటం కదా ముఖ్యం అంటాడు.

ఏ పరీక్షు ప్యాసయితే స్పెషల్ ఎలవెన్సు వస్తుందంటే, నానా అవస్థాపడి ఆ పరీక్షకి వెళ్ళి ప్యాసయి ఆ లాభం పొందుతాడు. రాజారావు ప్రాణానికి డబ్బుకి లంకె.

కాని యీ సారి పరీక్షలతో ప్రమేయం లేకుండా కుటుంబనియంత్రణ ఆపరేషన్ చేయించుకున్నవారికి రెండు యింక్రిమెంట్లు యిస్తానంది ప్రభుత్వం. అదీ యిద్దరు పిల్లల్ని కన్నాక. రాజారావు ముందుచూపు యీ విషయంలో దెబ్బ తింది.

ఒక తేదీ తర్వాత యీ ఆపరేషన్ చేయించుకోవాలి అని నిర్ణయించిన ప్రభుత్వం, ఎప్పటిలోగా అనేది చెప్పలేదు. అందుకే రాజారావు మొదట్లో అంత బాధ పడలేదు. కాని యిప్పుడు ప్రభుత్వం మారింది. ఈ అవకాశం ఎంతకాలం వుంటుందో, ఈ యింక్రిమెంట్సు ఎంతకాలం వస్తాయో ఎవరు

హామీా యివ్వగలరు ? చేతనయితే త్వరపడాలి. అంతే -! రాజారావు మనసు అందుకే ఆందోళన పడుతోంది.

తను డెభ్భయిలోనే పెళ్ళాడివుంటే, ఈపాటికి యిద్దరి పిల్లల్ని యీాజీగా కనేసి రెడీగా వుండేవాడు. కాని రెండేళ్ళల్లో యిద్దర్ని ఎలా కనడం ? తను అతి జాగ్రత్తకి పోయి అసలు ఒక్కర్నీ కనలేదే ! దీనికెవరు బాధ్యులు ? పెళ్ళిళ్ళు స్వర్గంలోనే జరిగిపోతాయంటారు. ఈ సుమతి తనకి రాసిపెట్టి వున్నప్పుడు, నాలుగేళ్ళ నాడే కుదిరిపోయి పెళ్ళి జరిగిపోయి వుంటే ఎంత బాగుండేది ! ఈ సుమతి కాకపోతే మరొకతె. మూడేళ్ళ క్రితం వచ్చిన కొబ్బరితోట అమ్మాయిని చేసుకున్నా బాగుండి పోయేది, ఆ అమ్మాయికి ఇప్పుడు ఇద్దరు పిల్లలు - మళ్ళీ కడుపు -

కొబ్బరితోట కట్నంగా ఇస్తామంటే అది తనకి లాయకీగా వుండదని తోట అమ్మి రొక్కంగా ఇమ్మన్నాడు. దానికి వాళ్ళు వొప్పుకోలేదు. అది దూసుకుపోయింది.

ఎంత నష్టం! ఇది ఎలాభర్తీ చేయగలడు? తనకంటే జూనియర్సు యింక్రిమెంట్సు తీసుకుంటుంటే తను చూస్తూవూరుకోగలడా! చస్తే వూరుకోలేడు. అది ఒక్కనాటికి జరగటానికి వీలులేదు. రాజారావు ఆలోచనలతో సతమతమై పోతున్నాడు

"ఏమండీ మరీ అలా వున్నరేమిటి ?" అంది సుమతి భయంగా.

'ఇదిగో నాకు చాలా విసుగ్గా వుంది. నా కళ్ళెదురుగా కనిపించకు. నా దురదృష్టం నీ రూపంలో నన్ను చుట్టుకుంది'

అన్నాడు రెండింతలైన కోపంతో. అతని ధోరణి మరీ వింతగా అనిపించి -

ఏమిటండి అంత కోపం, అంది కాస్త గట్టిగా.

ఆ కొబ్బరి తోట అమ్మాయిని చేసుకున్నా హాయిగా వుండేది, మనసులో గిర గిర తిరుగుతున్న మాటలు తెలీకుండా బయటకొచ్చేశాయి.

సుమతి చర్రున లేచింది

'ఛీ ! మీ కసలు సిగ్గులేదు. పెళ్ళై రెండేళ్ళు అయినా యింకా ఎవర్నో చేసుకోవాల్సింది అంటున్నారంటే....' అని యింకా ఏదో అనబోయింది.

'సిగ్గెందుకు ? నేనెప్పుడూ ప్రాక్టికల్ గా ఆలోచిస్తాను.

"ఆ పిల్లకి యిద్దరు పిల్లలు కూడాను."

"అందుకే నే చెప్తున్నది."

"మీకు గొప్ప గొప్ప ప్లానులు వున్నాయిగా, వాటిని దాటి రావాలంటే బ్రహ్మ కూడా భయపడుతున్నాడు.

"నీకు చెప్పాడు బ్రహ్మ."

సర్లెండి. యింతకీ నన్నేం చెయ్యమంటారు ?" అంది సుమతి విసుగ్గా.

నోరు మూసుకోమంటా. నా కొళ్ళు మండిపోతుంది. ఈ నష్టం ఎలా భరించాలా అని నేను బాధపడుతోంటే మధ్య నీ గోలొకటి'

"ఏమిటండీ ! మరీ జేబులో డబ్బులు పోయినట్లు"

"మరేమిటి ? అంతే కదా, మనకి రావాల్సిన డబ్బులు, వస్తాయనుకున్న డబ్బులు రాకపోతే జేబులో డబ్బులు పోయినట్టే లెక్క."

"ఏడిసినట్టే వుంది" సుమతి మూతి మూడు వంకరలు తిప్పింది.

ఈ విషయంలో ఏదైనా మానిటరీ లాస్ వస్తే అది ఎంత తెలివితక్కువ వుంటో అంత ఆశాపాతకంగాను, అసహ్యంగానూ వుంది. రాజారావు దృష్టిలో మామగారు అల్లుడికి జన్మంతా బానిస.

"బాగుంది వరుస. ఊరి పిడుగు వీరిసెట్టిని కొట్టిందిట వెనుకటికి" అని రుసరుసలాడుతూ లోపలికి వెళ్ళింది సుమతి.

* * *

రాత్రంతా నిద్రపట్టక రాజారావు పక్కమీద దొర్లుతూనే వున్నాడు. అతనికి తెల్లారగట్ల మగత నిద్రలో అద్భుతమైన ఒక ఆలోచన మెరిసింది. ఛంగున లేచి కూర్చున్నాడు. మెలకువగా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చాడు.

ప్రొద్దున్న కాఫీ తాగుతూ సుమతికి తన ప్లాను విని పించాడు. ఆమె కొయ్యబారిపోయింది. సుమతి అక్కగారికి అయిదుగురు పిల్లలు, అందులో ఒక్కరిని తాము పెంపకానికి తెచ్చుకునేటట్లు, తను వెంటనే ఆపరేషను చేయించుకునేటట్లు, రాజారావు పథకం. సుమతి వలవలా ఏడ్చింది. "అదేవిటండీ, మన కేమంత ఖర్మ. హాయిగా, మనకీ ఒకరో యిద్దరో పుడ తారు. ఆ తర్వాత మీ యిష్టం ప్రకారం చేసుకోవచ్చు అంది ఏడుస్తూ -

రాజారావు కస్సుమన్నాడు. 'నీ యిష్టం వచ్చినప్పుడు చేస్తానంటే అవకాశం ఆగదు. నువ్వు నోరు మూసుకో, మీ అక్కపిల్లలు నీ పిల్లల కాదా, నాకే లేని భేదం నీకేమిటి' అంటూ దబాయించాడు.

సుమతి ఏడ్చింది, కోపగించుకుంది, బ్రతిమాలింది. సాధించింది, అయినా రాజారావు వినలేదు.

o o o

అరవై ఏళ్ళు పై బడిన డాక్టరు రంగనాథరావు ఏవో కొన్ని పరీక్షలు చేసి "మీకు పిల్లలా ?" అన్నాడు. రాజా రావు తడబడకుండా 'ఇద్దరు' అన్నాడు ఆయన ముఖంలో అనుమానం తాండవించింది.

"చిత్రంగా వుందే ! మీరు చెప్పిందే నిజమైతే నేను చెప్పబోయేది దారుణంగా వుంటుంది. మీ కసలు పిల్లలు పుట్టే అవకాశమే లేదు" అన్నాడు. రాజారావు ఉలిక్కి

పడ్డాడు. మరింకేమీ మాట్లాడలేక పోయాడు. డాక్టరు ముందు ఒక అబద్ధాల కోరుగా, దోషిగా నిలబడటానికి అతనికి చాలా సిగ్గుగా అనిపించింది.

డాక్టరు రంగనాథరావు మాత్రం ఇతన్ని పట్టించుకో లేదు. ప్రక్క రూమ్‌లో బల్లమీద పడుకోబెట్టిన మరొక రోగిని చూడటానికి వెళ్ళిపోయాడు. రాజారావుకి అక్కడ ఒక్క క్షణం వుండబుద్ధికాలేదు. డాక్టరుతో మర్యాద కోసమైనా చెప్పకుండా బయటకి అడుగులు వేశాడు. అతనికి ప్రపంచమంతా గిర్రున తిరుగుతున్నట్లుగా ఉంది. తను పిల్లలు వద్దనుకుని ఈ నిర్ణయానికి వచ్చిన వాడయినా. తనకు అసలు పిల్లలే పుట్టరనగానే ఏదో కోల్పోయినట్లు, అంతా చీకటిగానూ అనిపించింది. పిల్లలు లేకుండా నిస్సారమైన బ్రతుకు నిరర్కం అనిపిస్తోంది. తను పిల్లలు లేకుండా బ్రతకలేడనిపిస్తోంది. తనకి వున్న దాన్ని పోగొట్టుకుని యింక్రిమెంట్లు తెచ్చుకుందామను కున్నాడు, కాని తను పోగొట్టుకోడానికి కూడా తన దగ్గరేమీ లేదని తెలియగానే, తనలోని శక్తినంతా ఎవరో లాగేసినట్లు నీరసపడిపోయాడు రాజారావు.

తనకి యింక్రిమెంట్లు ఏలాగూ రావు. కాని తనింట్లో చంటిపాప పుట్టదంటే బాధగావుంది. ఒక చిట్టితల్లి తనింట్లో పారాడదంటే వేదనగా వుంది తననింకే జన్మలో, ఒకపసిపాప "నాన్నా. నానా" అని పిలవదని తలుచుకుంటే హృదయం బ్రద్దలై పోతూంది. తనెంత దురదృష్టవంతుడు. తనలో ఉన్న

అత్యాశ తన్నీస్థితికి తెచ్చిందేమో ! తనలో ఉండే అమానుషత్వం తనని నిర్దాక్షిణ్యుణ్ణి చేసింది కాబోలు. ఇప్పుడు నిజంగా తనింకొకరి పిల్లల్ని పెంచుకోవాల్సిందే. కాని వాళ్ళు తను కన్నబిడ్డలవుతారా ? కానేకాదు. ఐనా తప్పదు. తన నిర్ణయాన్ని పై నుండి దేవతలు తథాస్తు అన్నారు. పాపం సుమతి ఎంత ఏడ్చింది ! ఎంత బ్రతిమాలింది. తన నిర్ణయం మార్చుకోమని కాళ్ళా వేళ్ళా పడింది. తను వినలేదు. ఇప్పుడేమనుకున్నా ఏం లాభం ? దేవుడి నిర్ణయం ఎవరు మార్చగలరు ?

రాజారావు బుర్ర పశ్చాత్తాపంతో ఆలోచనలతో వేడెక్కిపోయింది. ఆవేదనతో మనసు బరువెక్కింది. మన ప్లాన్‌తోనే అన్నీ జరుగుతాయని భావించే రాజారావుకి, ఎదురు దెబ్బ తగినట్లయింది. అతని కళ్ళల్లో నీరూరుతోంది. అతన్ని పెద్ద నిస్సత్తువ ఆవహించింది. ఇంట్లో అడుగు పెట్టగానే దుఃఖం ఆగలేదు. భార్య చూడకుండా దిండులో తల దూర్చి గుండె బరువు దించుకున్నాడు.

○ ○ ○

రాజారావు ఒకటే అనుకున్నాడు. డాక్టరు రంగనాథరావు గార్ని కలిసి తనకి పిల్లలు పుట్టే మార్గము చెప్పమని అడుగుదామని నిర్ణయించాడు. ఒక్క క్షణం ఆలశ్యం చెయ్యకుండా హాస్పటల్‌కి బయలుదేరాడు.

"నన్ను క్షమించండి డాక్టరు గారూ, నాకసలు పిల్లలే లేరు. నాకు పిల్లలు పుట్టేమార్గం చెప్పండి" అన్నాడు అవ మాన భారంతో కృగిపోతూ.

"ఆ మాటకొస్తే నువ్వే నన్ను క్షమించాలి. మిస్టర్ రాజారావ్ ! నిన్ను తప్పుడు మార్గంలోంచి లాగ టానికే నీకు అబద్ధం చెప్పాను. నీతో ముఖ పరిచయం కూడా లేని నా దగ్గరకి వచ్చి అబద్ధం చెప్పి నీ పని చేయించు కుందా మని చూశావు, నీ భార్య ముందుగా నాకీ విషయం చెప్పింది. అందుకే నీకు ఒకటి చెవుతున్నా, ఆపరేషన్ అనగానే మరో మాట లేకుండా చేసేదే. ఈ సమయంలో మీ నిర్ణయాలు మీరెంతో జాగ్రత్తగా చేసుకోవాలి. ఇలాంటి విషయాల్లో తొందరపాటు కూడదు. ఫామిలీ ప్లానింగ్ అంటే కుటుంబ నిర్మూలన అని అర్థం కాదు. గుర్తు పెట్టుకోండి." ఆయన మాటలు గంభీరంగా ఉన్నాయి, కఠినంగా కూడా. రాజా రావుకు, ఆనందం, ఆశ్చర్యం ఆవేదన ముప్పిరి గొన్నాయి.

( స్నేహ మాస ప్రతిక నుండి )